సాక్షి నిర్మల్

శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



ఇదేమి 'పంచాయితీ'

స్వల్ప కాలంలో డబ్బులు రెట్టింపు అవుతాయని ఆశపడ్డ వారికి నిరాశే ఎదురైంది. వేల సంఖ్యలో బాధితులు ఉండటం, కోట్ల వ్యాపారం జరగడం జిల్లాలో కలకలం రేపుతోంది. IIలో▸

నిర్మల్ డిపోకు రికార్డు ఆదాయం

నిర్మల్‌టౌన్: డ్రైవర్లు, కండక్టర్లు సిబ్బంది కృషితో ఆర్టీసీ నిర్మల్ డిపోకు భారీగా ఆదాయం సమకూరుతోందని డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి గురువారం తెలిపారు. బుధవారం ఒక్కరోజే రూ.40,51,267 ఆదాయం వచ్చిందని వెల్లడించారు. ఏపీలోని అమలాపురం, ఉదయగిరి, కందుకూరు, పామూరు, గుంటూరు, ఒంగోలు రూట్లతోపాటు ఇతర రూట్ల ద్వారా ఆదాయం సమకూరిందని వివరించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.4 /28.4

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. ఎండ తీవ్రత, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పార్లమెంట్ పోలీస్ అబ్జర్వర్‌గా రాజేశ్‌కుమార్



రాజేశ్‌కుమార్‌కు మొక్క ఇస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పోలీస్ అబ్జర్వర్‌గా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 2011 ఐపీఎస్ బ్యాచ్ అధికారి రాజేశ్‌కుమార్ సక్సేనా నియమితులయ్యారు. గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్న ఆయనను జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం స్థానిక పెన్‌గంగా అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.

ఇంటర్ టాపర్‌కు ఏఎస్పీ అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న కాంతిలాల్‌పాటిల్

భైంసాటౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గడపాలే అంబదాస్ కూతురు సృజన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ విద్యార్థినిని తన కార్యాలయంలో అభినందించారు. శాలువాతో సన్మానించి, నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో సీఐ రాజారెడ్డి, ఎస్సైలు షరీఫ్, ఎంఏ గౌస్, అమోస్, నారాయణ్ సింగ్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో ప్రతిభ



మణికంఠ

ఖానాపూర్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం-శైలజ దంపతుల కుమారుడు మణికంఠ ప్రతిభ కనబర్చాడు. ఓబీసీ కోటాలో 9,300 ర్యాంకు, కామన్ ర్యాంకు 33,640 సాధించాడు. ఆలిండియా లెవెల్ ర్యాంకు పర్సంటైల్ 97 పాయింట్లు పొందాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించాడు.

తాగు నీటి సమస్య లేకుండా చూడాలి

కడెం: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో కడెం, దస్తురాబాద్ మండలాల పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఇంటి పన్నులు వసూలు చేయాలని, పారిశుధ్య నిర్వహణ, నర్సరీల్లో మొక్కలు, పల్లె ప్రకృతి వనాల సంరక్షణ చేపట్టాలన్నారు. ఆయన వెంట డీఎల్‌పీవో రమేశ్, ఎంపీడీవో అరుణ, ఎంపీవోలు కవిరాజు, అనిల్ ఉన్నారు.

'బిల్లులు విడుదల చేయండి'

నిర్మల్ రూరల్: పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ బిల్లులు విడుదల చేయాలని జిల్లా ఎస్‌టీవో కార్యాలయంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని పొదుపు చేసుకున్న డబ్బులు సకాలంలో అందక ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. పాత విధానంలో చెల్లింపులు జరిగేలా చూడాలని కోరారు. పెండింగ్ షెడ్యూల్ మే 15లోపు జీపీఎఫ్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సారంగాపూర్ మండల అధ్యక్షుడు మతం పరమేశ్వర్, ఆసిఫ్‌అలీ ఉన్నారు.

తగ్గిన ఫలితం..!

- ఇంటర్ ఉత్తీర్ణతలో మూడు స్థానాలు తగ్గుదల
- కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ కాలేజీల్లో మెరుగైన ఫలితాలు
- కార్పొరేట్ కళాశాలల జోరు..
- నిరాశపరిచిన ప్రభుత్వ కాలేజీలు



పరీక్ష రాస్తున్న ఇంటర్ విద్యార్థులు(ఫైల్)

నిర్మల్ రూరల్: జిల్లాలో ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు నిరాశపరిచాయి. రాష్ట్రంలో జిల్లా 12వ స్థానంలో నిలిచింది. గతేడాది 69 శాతంతో 9వ స్థానం నిలువగా ఈసారి మూడు స్థానాలు తగ్గి 12వ స్థానంతో సరిపెట్టుకుంది. ఈసారైనా మెరుగైన ఫలితాలు వస్తాయనుకున్నా... గతంతో పోలిస్తే ఫస్టియర్‌లో కూడా ఉత్తీర్ణత శాతం మరింత తగ్గింది. గతేడాది 62%తో 8వ స్థానంలో నిలువగా ఈసారి మాత్రం ఉత్తీర్ణత 56.05 శాతానికే పరిమితమైంది. దీంతో జిల్లా ర్యాంకు ఏకంగా 8 స్థానాలు పడిపోయి 16 స్థానంలో నిలిచింది. ఇదిలా ఉంటే.. ఫలితాల్లో జిల్లాలో మరోసారి అమ్మాయిలు సత్తా చాటారు. ప్రభుత్వ కాలేజీలు ఫలితాల్లో వెనుకబడ్డాయి. సోషల్ వెల్ఫేర్, కేజీబీవీ, ఎంజేపీ, మైనార్టీ కాలేజీల్లో ఆశాజనకంగా ఫలితాలు వచ్చాయి. ఇక ఈసారి కూడా కార్పొరేట్ కాలేజీల జోరు కొన సాగింది.

మెరుగుపడని ప్రభుత్వ కాలేజీలు..

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఇంటర్ ఫలితాల్లో నిరాశపర్చాయి. మొత్తం 13 కాలేజీలు ఉండగా సెకండియర్ ఉత్తీర్ణతలో కుభీర్ జూనియర్ కళాశాల 93.12%తో ప్రథమ స్థానం నిలువగా, 33.85% తో జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల చివరి స్థానంలో నిలిచింది. కడెం పెద్దూర్ 91.97%, లోకేశ్వరం 78.79%, ఖానాపూర్ 75.88%, జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాల 67.01%, సారంగాపూర్ 65.29%, ముథోల్ 53.21%, భైంసా 45.75%, దిలావర్‌పూర్ 43.79%, మామడ 41.18% ఉత్తీర్ణత మాత్రమే సాధించాయి. ఇక ఫస్టియర్‌లో కుభీర్ జూనియర్ కళాశాల 81.94% ప్రథమ స్థానంలో నిలువగా, కుంటాలలో సున్నా శాతం ఉత్తీర్ణత నమోదయింది. ఇక్కడ 5 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ఒక్కరు కూడా పాస్ కాలేదు. జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాలలో 13.66% ఉత్తీర్ణత నమోదయింది. ఈ కాలేజీలో మొత్తం 161 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా కేవలం 22 మంది మాత్రమే పాసయ్యారు. తానూర్ 72.53%, లోకేశ్వరం 71.84%, కడెం పెద్దూర్ 67.44%, ఖానాపూర్ 65.73%, సారంగాపూర్ 56.49%, ముథోల్ 54.26%, భైంసా 44.34%, దిలావర్‌పూర్ 42.68%, జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాల 41.48%, మామడ 32.52%ఉత్తీర్ణత మాత్రమే సాధించాయి.

వసతుల లేమి, పర్యవేక్షణ లోపం..

జిల్లాలో ఇంటర్ ఉత్తీర్ణత శాతం తగ్గడానికి వసతుల లేమి, పర్యవేక్షణ లోపమే కారణమని తెలుస్తోంది. కోవిడ్ తర్వాత 2021–22 విద్యా సంవత్సరంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో జిల్లాలో ఉత్తీర్ణత 70%కి పైగా ఉండగా ఈ ఏడాది మాత్రం 66.17 శాతానికి పరిమితమైంది. ముఖ్యంగా ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక తరగతుల నిర్వహణపై యంత్రాంగం పర్యవేక్షణ కొరవడింది. జిల్లా కేంద్రంతోపాటు మండలాల్లోని జూనియర్ కళాశాలల్లో ఫలితాలు రాబట్టేందుకు అధికారులు ఏమాత్రం కృషి చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. కాలేజీల్లో గదుల కొరత, అధ్యాపకుల కొరత, వసతుల లేమి కూడా ఫలితాలు తగ్గడానికి కారణంగా భావిస్తున్నారు.

కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ మెరుగు..

జిల్లాలో కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, గురుకుల కాలేజీలు, మహాత్మ జ్యోతిబాపూలే కళాశాలలో ఈ ఏడా ది మెరుగైన ఫలితాలు వచ్చాయి. జిల్లాలో 18 కేజీ బీవీలు ఉండగా 11 కళాశాలలుగా ఉన్నతీకరించా రు. ఇందులో 2023–24 సంవత్సరంలో పెంబిలో ఎంపీసీ, బైపీసీ కోర్సులు ప్రారంభించారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులై శత శా తం నమోదు చేసింది. నర్సాపూర్ కేజీబీవీ, కడెం కే జీబీవీలో కూడా 100% ఉత్తీర్ణత నమోదయింది. మొత్తంగా కేజీబీవీలో 89 శాతం ఉత్తీర్ణత వచ్చింది. కుంటాల మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ కాలేజీలో 92.99%, సారంగాపూర్ మండలం జామ్ సోషల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాల 100%, ముథోల్ 86.36%, లెఫ్ట్ పోచంపాడు 79.71%, కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ 98%, బాసరలో 89.23% ఉత్తీర్ణత నమోదయింది. మ హాత్మా జ్యోతిబాపూలే కళాశాల విషయానికి వస్తే ఖానాపూర్‌లో 98.53% ఉత్తీర్ణత రాగా, రాచాపూర్ 68.75% ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్టియర్‌లో అత్యల్పంగా కుభీర్ మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే కళాశాల కేవలం 28.26% మాత్రమే ఉత్తీర్ణత కాగా, రాచాపూర్‌లో 31.48 శాతం విద్యార్థులు పాసయ్యా రు. జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ గురుకుల కళాశాలలో 97.36% ఉత్తీర్ణత సాధించారు. కళాశాలలో రేగుంట ఆకాంక్ష ఏకంగా 1000 మార్కులకు 990 మార్కులు సాధించి సత్తా చాటింది. మైనార్టీ కళాశా ల విషయానికి వస్తే ఖానాపూర్‌లో 97.62%, భైంసాలో92.31%, నిర్మల్ 90% ఉత్తీర్ణత సాధించాయి.

సీఎంఆర్‌ను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు జరపాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సీఎంఆర్ సరఫరా, ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్ష చేశారు. సీఎంఆర్ సరఫరా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వారం రోజులుగా మిల్లింగ్ ప్రక్రియ చేపట్టని మిల్లుల నుంచి ధాన్యాన్ని వేరే మిల్లులకు బదిలీ చేయాలని సూచించారు. మిల్లింగ్‌లో నిర్లక్ష్యం వహిస్తున్న మిల్లర్లకు నోటీసులు జారీ చేయడంతోపాటు ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలన్నారు. సీఎంఆర్ సరఫరాలో రాష్ట్రస్థాయిలో జిల్లా స్థానం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిల్లుల వారీగా ధాన్యం నిల్వలు, మిల్లింగ్, గిడ్డంగులకు పంపిన లోడ్ వివరాల రిపోర్టు రోజువారీగా సమర్పించాలన్నారు. యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఎస్‌వో నందిత, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకళ, డీసీఓ నర్సయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్, జిల్లా మార్కెటింగ్ ఏడీ అష్ఫక్ పాల్గొన్నారు.

23 మంది.. 42 నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సుగుణ(ఫైల్)



బీజేపీ అభ్యర్థి నగేశ్(ఫైల్)



బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు(ఫైల్)

- ముగిసిన పార్లమెంట్ నామినేషన్ల పర్వం
- చివరిరోజు ఏకంగా 18 మంది దాఖలు
- నాలుగుసెట్లు వేసిన 'ప్రధాన' అభ్యర్థులు
- బీజేపీ, కాంగ్రెస్ నుంచి రెండో అభ్యర్థులూ
- మరో ఏడు పార్టీలు.. స్వతంత్రులు కూడా..

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం ముగిసింది. చివరిరోజు రోజు ఏకంగా 18 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. మొత్తంగా 23 మంది అభ్యర్థులు.. 42 నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు చెరో నాలుగు సెట్ల నామినేషన్లు వేశారు. బీజేపీ, కాంగ్రెస్ నుంచి రెండో అభ్యర్థి కూడా ఒక్కో సెట్ దాఖలు చేశారు. మరో ఏడు రాజకీయ పార్టీల నుంచి, 13 మంది స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్ వేశారు.

ఇదీ పరిస్థితి..

దేశంలో సాధారణ ఎన్నికల నిర్వహణకు మార్చి 16న ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. అదేరోజు నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఏప్రిల్ 19 నుంచి జూన్ 1వరకు దేశంలో ఏడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తుండగా, తెలంగాణలో నాలుగు విడతల్లో నిర్వహించనున్నారు. కాగా, నోటిఫికేషన్ ఏప్రిల్ 18న జారీ కాగా, అదేరోజు నుంచి నామినేషన్ల పర్వం మొదలై గురువారం వరకు కొనసాగింది. ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌కు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా నామినేషన్లు స్వీకరించారు.

ప్రధాన పార్టీల నుంచి..

ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆ పార్టీ ముఖ్య నేతలతో కలిసి నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ ఈనెల 22న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీహరిరావుతో కలిసి నామినేషన్ వేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు 23న మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, రాష్ట్ర నాయకుడు యూనుస్ అక్బానితో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ 24న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్, ముథోల్, సిర్పూర్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి నామినేషన్ వేశారు. కాగా, ఈ అభ్యర్థులు పార్టీ నాయకులతో కలిసి మిగతా సెట్లు కూడా దాఖలు చేశారు. బీఎస్పీ, గోండ్వాన దండకారణ్య పార్టీ, ఆధార్ పార్టీ, ఇండియా ప్రజాబంధు పార్టీ, ఐపీబీపీ పార్టీ, విద్యార్థుల రాజకీయ పార్టీ, అన్న వైఎస్సార్ పార్టీ, రాష్ట్రీయ మానవ్ పార్టీ అభ్యర్థులతోపాటు మరో 13 మంది స్వతంత్రులు కూడా నామినేషన్ వేశారు.

బీజేపీ, కాంగ్రెస్ నుంచి రెండో అభ్యర్థి..

బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీ ఫామ్ అందుకున్న అభ్యర్థులు గోడం నగేశ్, ఆత్రం సుగుణతో పాటు ఆ పార్టీల నుంచి రెండో అభ్యర్థి నామినేషన్లు కూడా దాఖలయ్యాయి. బీజేపీ నుంచి మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, కాంగ్రెస్ నుంచి ఆత్రం భాస్కర్ నామినేషన్ వేశారు. కాగా, సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు తిరి గి బీజేపీ టిక్కెట్ దక్కకపోవడంతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నా రు. దీంతో రెబెల్‌గా బరిలో ఉంటారనే ప్రచారం జరిగినా ఆయన ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ప్రధాన పార్టీల నుంచి ముగ్గురు ఆదివాసీ అభ్యర్థులే బరిలో ఉండడంతో ఆయన ఈ నిర్ణ యం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల ప్రక్రియలో మిగతా దశలు

- నేడు నామినేషన్ల పరిశీలన
- 29 వరకు ఉపసంహరణ
- అదేరోజు సాయంత్రం గుర్తుల కేటాయింపు
- పోలింగ్ తేదీ 13 మే.
- కౌంటింగ్ జూన్ 4.

అప్రమత్తతతో మలేరియా నివారణ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: అప్రమత్తతతో మలేరియాను నివారించవచ్చని, మూడేళ్లుగా జిల్లాలో మలేరియా కేసులు నమోదు కాలేదని, ఇక ముందు రాకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నయానారెడ్డి సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ప్రపంచ మలేరియా నివారణ దినం గురువారం నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నయనారెడ్డి మాట్లాడుతూ నిర్మల్ పక్కనే ఉన్న జిల్లాలో మలేరియా కేసులు నమోదు అవుతున్నందున మరింత అప్రమత్తతతో విధులు నిర్వహిస్తూ, దోమల నివారణ గురించి, వ్యాధి లక్షణాల గురించి, వ్యాధి చికిత్స గురించి, విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలు ఆరోగ్య సహాయకులు సర్వెలెన్స్ కార్యక్రమాన్ని సక్రమంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, సబ్ యూనిట్ అధికారులు కన్నయ్య, రాజు, వేణురావు, ఆరోగ్య పర్యవేక్షకులు భోజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్య సహాయకులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే క్షేత్రపర్యటన

- టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరామ్
- దిలావర్‌పూర్‌లో ఉపాధి కూలీలతో సమావేశం




గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

దిలావర్‌పూర్: గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకే తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నానని తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్ తెలిపారు. దిలావర్‌పూర్ మండల కేంద్రంలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామంలో ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక అసమానతలు పెరిగాయన్నారు. సంపన్నులకే మోదీ దేశ సంపదను దోచి పెడుతున్నారని ఆరోపించారు. కుటుంబంలో 100 రోజుల పని ఎవరికీ దొరకడం లేదని విమర్శించారు. వ్యవసాయ బడ్జెట్ బాగా తగ్గించారని తెలిపారు. ఇకనైనా ఓటుపై ప్రజలు దృష్టి సారించాలన్నారు. ఓటు అనే ఆయుధాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ తరలించాలని వినతి..

దిలావర్‌పూర్‌లోని ఇథనాల్ ఫ్యాక్టరీని తరలించాలని వీడీసీ సభ్యులు, గ్రామస్తులు కోదండరామ్‌కు వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన ఆ యన ఇథనాల్ ఫ్యాక్టరీని ఆపేందుకు కృషి చే స్తానని హామీ ఇచ్చారు. గతంలో ఫ్యాక్టరీ వద్ద ని ఆందోళన చేసిన రైతులపై పెట్టిన కేసులను సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా టిజాక్ నాయకుడు విజ యకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకుల తక్కల విద్యాసాగర్‌రెడ్డి, అర్గుల రమణ, పాల్దె అనిల్, కట్కం రాజారెడ్డి, బెల్లాజి రాజు, బిల్ల దయాకర్, సప్పల రవి తదితరులు పాల్గొన్నారు.

'పాకాల' ఇంటికి కోదండరామ్



కోదండరామ్‌ను సన్మానిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌టౌన్/నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని పాకాల ఫౌండేషన్ చైర్మన్ రాంచందర్ నివాసానికి టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం గురువారం వచ్చారు. మర్యాదపూర్వకంగా రాంచందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కోదండరాంను శాలువాతో రాంచందర్ సత్కరించారు. ఇందులో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్నయాదవ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్, అనుముల భాస్కర్, తిలాక్ రావు, వినోద్‌కుమార్ ఉన్నారు.

కోదండరామ్‌ను కలిసిన శ్రీహరిరావు

నిర్మల్ పట్టణానికి వచ్చిన కోదండరామ్‌ను డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర రాజకీయాలు, పార్లమెంట్ ఎన్నికలపై చర్చించారు.

క్లుప్తంగా

కేయూ డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, తదితర కోర్సుల్లో 2వ, 6వ సెమిస్టర్ పరీక్షలు మే 6 నుంచి, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7 నుంచి జరగనున్నాయి. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్ విడుదల చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నరిసింహాచా రి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్ట ర్ తిరుమలాదేవి గురువారం తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 24, 27వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, నాలుగో సెమి స్టర్ పరీక్షలు మే 7, 9, 15, 17, 20, 22, 25, 28 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆరో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 24, 27, 29, 31 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయి. పూర్తి వివరాలకు www. kakatiya. ac. in వెబ్‌సైట్‌లో చూడవచ్చని అధికారులు సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో గురువారం పేకాట స్థావరంపై ఎస్సై సుమాంజలి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.4,410 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు.

గుడుంబా పట్టివేత

కుంటాల: మండలంలోని దౌనెల్లి పంచాయతీ పరిధిలోని దౌనెల్లి తండాలో గురువారం గుడుంబా పట్టుకున్నట్లు ఎస్సై వి.రజనీకాంత్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తండాకు చెందిన ఆనంద్‌రావు ఇంట్లో తనిఖీ చేయగా గుడుంబా లభ్యమైనట్లు ఆయన పేర్కొన్నారు. గుడుంబా విలువ రూ.4 వేల వరకు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయ ఆవరణలో ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు ఎస్సై వి.రజనీకాంత్ తెలిపారు. లోకేశ్వరం మండలంలోని రాజురా గ్రామానికి చెందిన రాజశేఖర్ గురువారం కల్లూర్ సాయిబాబా ఆలయానికి దైవదర్శనానికి వచ్చారు. ఆలయం ఎదుట నిలిపిన హీరో ఫ్యాషన్ ప్రో ద్విచక్ర వాహనం కనిపించకుండా పోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం


గంగయ్య

నేరడిగొండ: మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన సంటి గంగయ్య అదృశ్యమైనట్లు అతని భార్య సంటి వనిత గురువారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బీడీ ప్యాకింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న గంగయ్య ఆర్మూర్‌లోని తన స్నేహితుడికి రోడ్డు ప్రమాదం జరిగిందని ఇంట్లో చెప్పి ఈనెల 22న సాయంత్రం బయల్దేరి వెళ్లాడు. 23న ఉదయం నుంచి ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వస్తోంది. ఆర్మూర్ పరిసర ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపింది.

ఇదేమి ‘పంచాయితీ’



- బెహతర్ జిందగీకా వాదా అంటూ కుచ్చుటోపీ
- జూనియర్ అసిస్టెంట్ నుంచి ఎదిగి మోసాలు
- కొందరి భాగస్వామ్యంతో రూ.కోట్లకు టోకరా
- ఇతర జిల్లాకు బదిలీ అయిన ఆ ఉన్నతాధికారి
- ఉమ్మడి జిల్లాలో 2 వేల మంది బాధితులు!

ఉపాధ్యాయుడి మాట విని ఓ గ్రామానికి చెందిన రైతు పదేళ్ల క్రితం ఫిక్స్ డిపాజిట్ రూపేనా లక్ష రూపాయలు చైన్ సిస్టమ్ స్కీమ్ (గొలుసుకట్టు)కింద ఓ కంపెనీలో విడతల వారీగా నగదు జమ చేశాడు. ఆరేళ్లలో రెట్టింపవుతుందని ఆశ చూపడంతో పంటను అమ్మిన డబ్బులు వారికి చెల్లించాడు. ఇల్లు కట్టుకుందామని, కూతురు పెళ్లి చేద్దామని భావించి వాటిని మరోసారి రెన్యూవల్ చేశాడు. కరోనా సమయంలోనే వీటి గడువు ముగిసినా ఇంతవరకు చెల్లించడం లేదు. రూ.4లక్షలు ఇవ్వాల్సిన సదరు కంపెనీ చేతులెత్తేసింది. దీంతో ఆ రైతు లబోదిబోమంటున్నాడు. ఇలాంటి బాధితులు ఉమ్మడి జిల్లాలో దాదాపు 2వేల మంది వరకు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఆదిలాబాద్‌టౌన్: స్వల్ప కాలంలో డబ్బులు రెట్టింపు అవుతాయని ఆశపడ్డ వారికి నిరాశే ఎదురైంది. ఈ వ్యవహారంలో ఒకరిద్దరు కాదు.. ఏకంగా వేల సంఖ్యలో బాధితులు ఉండటం, కోట్ల వ్యాపారం జరగడం జిల్లాలో కలకలం రేపుతోంది. ఈ వ్యవహారం వెనుక ఓ జిల్లాస్థాయి అధికారి కీలక పాత్ర ఉండడం, పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు భాగస్వాములు కావడం చర్చనీయాంశమవుతోంది. అటు ఉద్యోగం చేస్తూనే మరోవైపు ఇటు ఓ కంపెనీ వ్యాపారం చేస్తూ నాలుగు చేతులా సంపాదించి కమీషన్ల రూపంలో లక్షలు కూడబెట్టుకున్నారు. బాధితులకు మాత్రం మొండి చెయ్యి చూపారు. సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన కొందరు గురువులు ఇందులో కీలకంగా ఉండటం విమర్శలకు తావిస్తోంది. మొదటి వ్యక్తి జిల్లా అధికారి ఉండగా, ఆ చైన్ సిస్టమ్‌లో రెండో వ్యక్తులుగా ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రస్తుతం ఈ విషయం బయటకు పొక్కడంతో ఏ నిమిషం ఏం జరుగుతుందోనని వారిలో గుబులు రేపుతోంది. వారి వద్దకు వచ్చిన వారికి డబ్బులు చెల్లిస్తామని నచ్చజెబుతూ మభ్య పెడుతున్నారు. తమకు డబ్బులు రావాల్సి ఉన్నాయని, ఇన్ని రోజులు ఆగారని, మరో వారం పది రోజులు ఆగాలని మాయమాటలు చెబుతున్నారు.

కొందరు గురువులే కీలకం..

సభ్య సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన కొందరు గురువులు కాసులకు కక్కుర్తి పడి ఈ దందాను కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు వృత్తి తప్పా మరో వ్యాపారం చేయడానికి వీల్లేదు. అయితే వీరిలో కొంతమంది వారి పేరిటనే వ్యాపారం చేస్తుండగా, మరికొంత మంది ఉపాధ్యాయులు భార్య, పిల్లల పేరిట దందాను కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో ఉపాధ్యాయులకు మంచి పేరు ఉండటంతో వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న విధంగా సాగుతోంది. అయితే ఇందులో చాలా మంది ఉపాధ్యాయులే బాధితులుగా ఉన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తే తాము కూడా ఇరుక్కపోతామని మిన్నకుండిపోతున్నట్లు తెలుస్తోంది. ఏజెంట్లుగా ఉన్న కొందరు ఉపాధ్యాయులు తమ బంధువులను చేర్పించారు. ఇప్పుడు వారు డబ్బుల పరంగా ఇబ్బందులకు గురిచేస్తుండడంతో ప్లాట్లు, ఇతర స్థిరాస్తులు అమ్మి వారి డబ్బులను తిరిగి ఇస్తున్నట్లు సమాచారం. మరికొంత మంది కంపెనీ నుంచి డబ్బులు వచ్చాక అందజేస్తామని వారిని చుట్టూ తిప్పుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్న అధికారితో పాటు ఏజెంట్లపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు. బాధితులెవరనేది గుర్తించే దిశగా దృష్టి సారించారు. ఇప్పటికే ఇంటలిజెన్స్ పోలీసులు కూపీ లాగి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు సమాచారం. దీంతో ప్రజలకు టోకరా వేసిన వారి పట్ల సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. రెండుమూడు రోజుల్లో వారిని అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.


చైన్ సిస్టమ్ కంపెనీకి సంబంధించి బాధితులకు అందించిన బాండ్ (ఫైల్)

అసలేం జరిగిందంటే..

జిల్లా కేంద్రంలోని బస్టాండ్ పక్కన 2003–04 సంవత్సరంలో ఓ చైన్‌సిస్టం కంపెనీ ఏర్పడింది. ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న ఓ గ్రామానికి చెందిన జూనియర్ అసిస్టెంట్ ఇందులో మొదటి వ్యక్తిగా చేరాడు. ఆయన కింద తలమడుగు మండలానికి చెందిన ఉపాధ్యాయ సంఘం నాయకుడు, ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మరో ఉపాధ్యాయుడు చేరాడు. ముగ్గురూ కలిసి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులను చేర్పించారు. ఫలానా కంపెనీలో డబ్బులు జమ చేస్తే ఆరేళ్లలో రెట్టింపు అవుతాయని నమ్మించారు. చైన్ సిస్టమ్‌లో ఉన్న వ్యక్తులకు 10 నుంచి 30 శాతం కమీషన్ వస్తుందన్నారు. అయితే వారు చెప్పిన విధంగానే ఏజెంట్లకు కమీషన్ వచ్చింది. దేశంలోని పలు ప్రాంతాల్లో విహార యాత్రలు, గిఫ్టులు ఇవ్వడంతో ఈ దందా ఓ స్థాయికి చేరింది. ప్రస్తుతం 2 వేల మంది వరకు ఈ చైన్ సిస్టమ్‌లో బాధితులు ఉన్నారు. 2020లో బాండ్ల గడువు ముగిసింది. ఆ సమయంలో డబ్బులు ఇవ్వాల్సి ఉండగా, కరోనా కారణంగా నిలిపివేయడం జరిగిందని చెప్పారు. రెండు మూడేళ్లు గడిచినా ఈ విషయం ఊసెత్తకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సదరు ఏజెంట్లను డబ్బుల విషయమై అడిగితే రేపుమాపు అంటూ తిప్పుకుంటున్నారు. కాగా కీలకంగా ఉన్న మొదటి వ్యక్తి పదోన్నతులు పొంది జిల్లా ఉన్నత స్థాయి అధికారిగా ఎదిగాడు.. ఆ వ్యాపారం కూడా అలాగే వృద్ధి చెందింది. ప్రస్తుతం ఆయన ఆ వ్యాపారం చేయకపోయినా కమీషన్ మాత్రం వస్తోంది. ఇటీవల పక్క జిల్లాకు బదిలీ అయిన ఆ ఉన్నత అధికారికి ఏజెంట్లు ఫోన్ చేస్తుండడంతో హైరానా చెందుతున్నాడు. శాఖ పరంగా ఆయనపై ఉన్నతాధికారులు కూపీ లాగితే ఈ అక్రమ దందా వ్యవహారం మరింతగా బయటపడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

బాధితులను గుర్తించే పనిలో ఉన్నాం



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆ ప్రైవేట్ చైన్ కంపెనీకి సంబంధించిన బాధితులను గుర్తించే పనిలో ఉన్నాం. వారి ద్వారా ఫిర్యాదు తీసుకుని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయిస్తాం. బాధితులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతాం.

– ఎల్.జీవన్‌రెడ్డి, డీఎస్పీ, ఆదిలాబాద్

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన హెడ్ కానిస్టేబుల్

- మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దోబీ కాలనీలో నివాసం ఉంటున్న ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన హెడ్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మహిళ ఇంటి సమీపంలోనే నివాసం ఉంటున్న హెడ్ కానిస్టేబుల్ గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో వెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాధితురాలు కేకలు వేయడంతో పరారయ్యాడు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

నేరడిగొండ(బోథ్): ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన ప్రవీణ్ (33) గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతికి కారణాలు తెలియరాలేదు. ఇటీవల గల్ఫ్ నుంచి వచ్చినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం రావడం లేదని యువకుడు..


జస్వంత్ (ఫైల్)

నేరడిగొండ(బోథ్): ప్రభుత్వ ఉద్యోగం రావడంలేదని మనస్తాపంతో బోథ్‌కు చెందిన గుమ్ముల జస్వంత్ (19)గురువారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ముందుగా బోథ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని తల్లి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

బాలికపై లైంగికదాడి చేసిన వ్యక్తికి పదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: బాలికపై లైంగికదాడి చేసిన కేసులో ఒకరికి పదేళ్ల జైలు, జరిమానా విధిస్తూ గురువారం కోర్టు తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపారు. ఏపీలోని ఒంగోలుకు చెందిన సిరిపోగు రాజు 2016లో నిర్మల్‌లోని శాంతినగర్‌లో గల బాలయ్య మేస్త్రి వద్ద కూలి పని చేసేవాడు. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన బాలిక పరిచయమైంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను 2016 డిసెంబర్ 27న చెన్నైలో ఉంటున్న అతని అక్క నాగమ్మ ఇంటికి తీసుకెళ్లాడు. బాలికతో కలిసి పది రోజులు అక్కడే ఉన్నాడు. ఆ తర్వాత స్వగ్రామమైన ఒంగోలు జిల్లా కట్టకింది పల్లెకు తీసుకెళ్లాడు. ఈ విషయం బాలిక తల్లి నరసమ్మకు తెలియడంతో నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై సునీల్ కుమార్ కేసు నమోదు చేసి, తదుపరి పరిశోధన నిమిత్తం అప్పటి సీఐలు జీవన్‌రెడ్డి, జాన్ దివాకర్‌కు అప్పగించారు. విచారణ అనంతరం రాజును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశ్వాస్ రెడ్డి 15 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జిల్లా ప్రత్యేక ఫోక్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ నిందితునికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


పోశెట్టి (ఫైల్)

తానూరు: మండల కేంద్రంలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన దొంతు లోడ్ పోశెట్టి (40) గతేడాది తన కూతురు వివాహం జరిపించాడు. ఇందుకోసం చేసిన అప్పులు ఎలా తీర్చేదని కుటుంబ సభ్యులతో అంటూ బాధపడుతుండేవాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో గురువారం ఉదయం తన పంటచేనుకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుని భార్య మాన్యబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..


దత్తాత్రి (ఫైల్)

భైంసాటౌన్: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ డి.రాజారెడ్డి తెలిపారు. పట్టణంలోని వినాయక్‌నగర్‌కు చెందిన దత్తాత్రి (48) గురువారం ఉదయం ఇంట్లో భోజనం చేసి పడుకుంటానని చెప్పి తన గదిలోకి వెళ్లాడు. కొద్దిసేపటికి అతని భార్య వెళ్లి చూడగా ఇంటిపైకప్పుకు ఉరేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని కిందికి దింపి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య జయశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

గుడిహత్నూర్: జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఇమ్రాన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన కాస్బే జ్ఞానేశ్వర్ (45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తరచూ జీవితంపై విరక్తి చెందినట్లు మాట్లాడేవాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి గ్రామ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నిర్మల్‌రూరల్: మండలంలోని కొండాపూర్ హుండాయ్ షోరూం వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి (35) మృతి చెందినట్లు రూరల్ ఎస్సై సాయికుమార్ తెలిపారు. గురువారం తెల్లవారు జామున హుండాయ్ షోరూం దగ్గర నేషనల్ హైవేపై గుర్తు తెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో పడి ఉన్నాడని సమాచారం రావడంతో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియరాలేదని, గుర్తుపట్టిన వారు 8712659515 నంబర్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

నిజామాబాద్ ఎంపీ అభ్యర్థిగా కడెం యువకుడు


నామినేషన్ పత్రం అందజేస్తున్న రఘు

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామానికి చెందిన ముత్యం రఘు నిజామాబాద్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశా రు. బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతుకు నామినేషన్ పత్రం అందజేశారు. సామాజిక కార్యకర్త అయిన రఘు గత అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల ఎమ్మె ల్యే అభ్యర్థిగా పోటీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


గంగాప్రసాద్ మృతదేహం

భైంసారూరల్: మండలంలోని సిరాల బస్‌స్టాప్ వద్ద గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. తానూరు మండలం బోంద్రట్ గ్రామానికి చెందిన గంగాప్రసాద్ (28) ద్విచక్రవాహనంపై భైంసాకు వస్తుండగా ఝరి(బి) గ్రామానికి చెందిన ప్రకాష్ బోంద్రట్ గ్రామానికి చెందిన అర్చన మరో బైక్‌పై భైంసాకు బయలుదేరారు. సిరాల బస్టాప్ వద్ద రెండు బైక్‌లో ఢీకొనడంతో గంగాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అర్చన, ప్రకాష్‌లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్

ఉట్నూర్‌రూరల్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆపార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. గురువారం మండలంలోని సాలెవాడ(బి), కోపర్‌ఘడ్ గ్రామాల్లో ఎమ్మెల్యే పాయల శంకర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌లతో కలిసి ప్రచారం నిర్వహించారు. సాలెవాడలో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కోపర్‌ఘడ్‌లో ఉపాధి హామి కూలీలతో ముచ్చటించారు. కార్యక్రమంలో నాయకులు కొండేరి రమేశ్, జగన్, లింగాగౌడ్, నందిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని వాయిపేట్, రాజంపేట్, చిమ్మన్‌గూడి గ్రామాల్లో గోడం నగేశ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాయిపేట్ లోని మహంకాళి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్లమెంట్ కో ఇన్‌చార్జి ముస్తాపూరే అశోక్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్, మండల అధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్, తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న గోడం నగేశ్

ఆదరించి గెలిపిస్తే అండగా ఉంటా

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

కైలాస్‌నగర్: ఆడబిడ్డగా, తోబుట్టువుగా ఆదరించి ఎన్నికల్లో గెలిపిస్తే నిత్యం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పట్టణంలోని కొలిపుర, బొక్కలగూడ, అంబేద్కర్ నగర్, ఖానాపూర్ కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయా కాలనీల్లో గడపగడపకు వెళ్లి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక పేదింటి బిడ్డగా పేదలు, సామాన్యుల కష్టాలు తెలిసిన దానిగా తాను ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. ప్రజల గొంతుకైన చట్టసభలో నినదిస్తానని, ఈ ప్రాంత అభివృద్ధి, హక్కుల కోసం పోరాటం చేస్తానన్నారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, రుక్మారెడ్డి, తదితరులు ఉన్నారు.


ఓటు అభ్యర్థిస్తున్న ఆత్రం సుగుణ

భానుడు భగభగ.. మూగజీవాలు విలవిల



జిల్లాలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో మానవులతో పాటు పశుపక్ష్యాదులు విలవిలలాడుతున్నాయి. భానుడి ప్రతాపానికి నిప్పుల కుంపటిగా మారగా ఉదయం 9 దాటిందంటే బయట అడుగుపెట్టలేని పరిస్థితి. జిల్లా కేంద్రంలో ఎండ వేడిమికి తట్టుకోలేక మూగ జీవాలు ఇలా చెట్ల నీడన సేదతీరుతూ కనిపించాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్









వన్యప్రాణుల దాహార్తి తీరుతోందిలా..

ఖానాపూర్: ఖానాపూర్ అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు పలుచోట్ల అటవీ అధికారులు నీటి కుంటలు, సాసర్ పిట్‌లను ఏర్పాటు చేశారు. చిరుతతో పాటు దుప్పులు, ఎలుగుబంట్లు, నీలుగాయిలు, సాంబారులు, అడవిదున్నలు, నెమళ్లు, అడవి పందులు దాహార్తి తీర్చుకోవడానికి వస్తున్నట్లు కెమెరా ట్రాక్‌లో గుర్తించామని ఎఫ్ఆర్‌వో వినాయక్ తెలిపారు. అనుమతి లేకుండా ఎవరూ అటవీప్రాంతంలోకి వెళ్లవద్దన్నారు.